


రాత్రి పదిన్నర గంటలు దాటింది.

పెద్దనాన్న ఉంటున్న ఇల్లు పెళ్లి సందడితో కళ కళ్లాడుతోంది. ఇంటి ముందున్న పెరట్లో వేయించిన పందిట్లో 'మెర్క్యురీ' దీపాల వెలుగు పూలమొక్కలపై పడి వింత అందాల్ని సృష్టిస్తూంది. వీధిలో పందిట్లో దీపాల వెలుగు వీధంతా పరచుకుంది.

మగపెళ్లి వారి భోజనాలయి అర్ధగంట దాటింది. అంతవరకూ వడ్డనలతోనూ, పెళ్లివారికి కావాల్సినవి అందివ్వడంతోనూ సరిపోయింది. వాళ్లు విడిదికైతే వెళ్లారు కాని, అయిదు నిముషాల కొకసారి దేనికోసమో ఓ దాని కోసం కబుర్లు వస్తూనే ఉన్నాయి!

పెళ్లివారు వచ్చింది పొద్దున్న అయిదు గంటలకైనా, అప్పుడే ఎన్నెన్ని సూటీ పోటీ మాటలు పడాల్సొచ్చింది!

వాళ్లు అయిదు గంటలకు బస్సుదిగి, విడిదికి రాగానే వేడి వేడి ఇడ్లీలు సప్లయి చేస్తే, ఓ పెద్దమనిషన్నాడు కదా—'కొబ్బరి కాయ పచ్చడి లేందే ఇడ్లీలు ఏమిటండీ' అని. వారం వారం దేవుడి గుళ్లో కొబ్బరికాయ కొట్టే వాళ్లు కూడా, అరటి పళ్లతో సరి పెట్టేసుకుంటున్న రోజులివి! అలాంటిది ఇడ్లీల్లోకి కొబ్బరికాయ పచ్చడి చేయించా లంటే మాటలే?

వాళ్లకోసం తుని నుండి ప్రత్యేకంగా మూడు బుట్టల తమలపాకులు తెప్పించాము. అయిదు కిలోల వక్కపొడి తెప్పించాము అప్పుడే బుట్టెడు తమలపాకులు ఖాళీ, అయిదు కిలోల వక్కపొడి ఖాళీ. సాయంత్రం వక్కపొడి కోసం మనిషిని బజారు తోలాల్సొచ్చింది!

సాయంత్రం ఉప్మా చేయిస్తే, అల్లమూ పచ్చి మిరపకాయలూ సరిగా వేయించక కక్కూర్తిగా వేయించామట!

గంటకోసారి కాఫీలు. 'బ్లాకు'లో కిలో మూడున్నర చొప్పున పంచదార కొన్నామని ఎలా చెప్పగలం?

పొద్దున్న భోజనాలు చేస్తూన్న సమయాన ఓ పెద్దమనిషి అన్నాడు గదా—'మే నెల జరుగుతోంది కద...భోజనాల్లో మామిడి పళ్లు వెయ్యాలని తెలియదా?' అని. కిలో మూడు రూపాయల చొప్పున ఎన్ని కిలోలు కొంటే పెళ్లివారికి సరిపోతాయి? పైగా నీళ్లకు కూడా 'కక్కూర్తి' చూపిస్తున్నా మట! ఎన్నిపోయించినా వాళ్ళకు సరిపోడంలేదు. హైదరాబాదంటే తెలియని వాళ్ళా? అక్కడ నీళ్ల కరువు తెలియందా? పెళ్ళికొడుకు ఏడెనిమిదేళ్ళుగా హైదరాబాదులోనే ఉద్యోగం చేస్తున్నాడాయిరి!

పెళ్ళివారి సూటీపోటీమాటలకు పార్వతి విన్నవుచ్చుకుంటోంది. బాలరాజు నోరు మూసుకుని కూర్చున్నాడు కనుకనా? సందు దొరికితే చాలు మాటకి మాట అప్పజెప్పేస్తు న్నాడు. మా తాతగారికి కొబ్బరి తోటల్లేవండీ అన్నాడు; మామిడి తోటల్లేవండీ అన్నాడు. అసలే వాడికి దుడుకుతనం ఎక్కువ. ఏమంటు న్నాడో వాడికే తెలయదు. పెళ్ళివారి హడా వుడిలో వాడి హడావుడొకటి. 'ఏదో చిన్న పిల్లాడ'నిసర్ది చెప్పలేక మాపని అవుతూంది!

తెల్లవారుఝామున నాలుగ్గంటలకి ముహూర్తం. అదే సాయంత్రం భోజనాలుచేసి పెళ్ళివారు బస్సెక్కేస్తారు.

పెదనాన్నా, పెదమ్మల సంతానమల్లా అయిదుగురాడపిల్లలు. కడసారిది పార్వతి.

పార్వతి అదృష్టవంతురాలు. పెళ్లికొడుకు అన్ని విధాలా యోగ్యుడు. ఏడెనిమిది వందలు తెచ్చుకుంటున్నాడు; చూడ్డానికి ఇంపుగా ఉంటాడు; దురభ్యాసాలేమీ లేవు: అందు వల్లనే పెళ్ళికొడుకు తండ్రి ఎనిమిదివేల కట్నం అడిగినా, పెద్దనాన్న మరి ఆలోచించ లేదు. తను చేసే ఆఖరి శుభకార్యమల్లా ఇదే కద. పార్వతి పెళ్ళయిపోతే పెద్దమ్మా, పెద నాన్నా 'రామా, కృష్ణా' అనుకుంటూ కాలం గడిపేయచ్చు.

పందిరి శుభ్రంచేసి, మాకు భోజనాలు వడ్డించారు. నాలుగు మెతుకులు కొరికి భోజ నాలయ్యాయనిపించాము

పెద్దనాన్న చుట్ట కాల్చుకుంటూ పందిట్లో వాలుకుర్చీలో కూర్చున్నాడు. బాల రాజు వెళ్ళి తమలపాకులూ, వక్కపొడి తెచ్చి ఇచ్చాడు.

"ఇంత ప్రేమ ఎప్పట్నుంచిరోయ్ బాలూ."

"ఈ ప్రేమ నాదికాదు మామయ్యా... రేణుకత్తయ్యది..."

"అన్నట్లు మీ అత్తయ్య ఏంచేస్తోంది?"

"రాధతో కబుర్లాడుతోంది..."

కొత్త పేరు. కుతూహలాన్ని అణచుకోలేక పోయాము.

"ఎవర్రా ఈ రాధ ? ..."

బాలరాజు 'భోల్డు' సిగ్గుపడిపోయి,

"ఏమో నాకు తెలియదు బాబా ..." అన్నాడు.

నేను నవ్వి,

"మీ అత్తయ్యనోసారి రమ్మను ..." అన్నాను.

బాలరాజు వెళ్ళాడు. మళ్ళీ ఆలోచించాను. ఎవరిరాధ ? బాలరాజు అలా సిగ్గుపడి పోయాడేమిటి'? ఇంతలో రేణుక వచ్చింది.

"పిల్చారటెందుకు ? ..."

రేణుకవైపు చూశాను. తన ముఖంలో అలసట స్పష్టంగా కన్పిస్తోంది.

"బాబు పడుకున్నాడా ?"

"రాధ దగ్గర ఆడుకుంటున్నాడు ..."

"వీడు బాలరాజేడీ ..."

"అతనూ బాబుతో ఆడుతున్నాడు ..."

నామనసులో అనుమానం మొలకెత్తింది. బాలరాజు ఆ రాధ పేరు చెప్తూ సిగ్గుపడ్డానికి కారణం ఊహించాను.

"ఎవరా రాధ ? ..."

"మీ బంధువుల అమ్మాయట ... కాసేపు పడుకోకూడదూ ? మళ్ళీ పొద్దున్నే లేవాలికద ..."

ఇంతలో బాలరాజు,

"అత్తయ్యా రాధ నిన్ను పిలుస్తోంది..." అంటూ వచ్చాడు.

"రేణూకా ... నువ్వు కాస్సేపు నడుం వాల్చకూడదూ ... నిన్నటి నుంచి చాలా అలసిపోయావ్...మళ్ళీ పొద్దున్నేలేవాలి ..." అంటూ పెద్దనాన్న పెద్దకూతురు పద్మావతి వచ్చింది.

"అమ్మా ... నాకూ, మామయ్యకీ 'స్పెషల్' కాఫీ కావాలే ..." అన్నాడు బాలరాజు.

"నీకు కావాలని అడక్క, మామయ్య పేరెందుకురా మధ్య ...."

పద్మక్కా, రేణుకా లోపలకు వెళ్ళి పోయారు. ఓ పావుగంటతర్వాత పద్మక్క మా కిద్దరికీ కాఫీలు తెచ్చి ఇచ్చింది. నేనూ, బాలరాజూ త్రాగాము.


"కాస్సేపు పడుకోండ్రా ..." అంటూ పద్మక్క వెళ్ళిపోయింది.

"ఒరేయ్ బాబూ...పదరా కాస్సేపు అలా తిరిగి వద్దాం..." నేను అనడమే తరువాయి, బాలరాజు హుషారుగా లేచాడు.

"ఓకే మామయ్యా... ఈ అల్లుడు నీ మాట జవదాటలేడు..."

నేను బయటకు ఎందుకు వెడతానో పెద్ద నాన్నకి తెలుసు. పెద్దవాళ్ళదగ్గర సిగరెట్లు కాల్చలేను! మేము బయటకు వెడుతూంటే 'ఆట్టే తిరక్కండిరా...తొందరగా వచ్చే సేయండి...'' అన్నాడు పెద్దనాన్న. "సరే" నని బయల్దేరాము.

హిందీ కాలేజీ ఎదురుగా ఉన్నతూము



మీద చతికిలబడ్డాం. రోడ్డు మీద రద్దీలేదు. అక్కడక్కడ దీపాలు వెలుగుతున్నాయి. నేను సిగరెట్టు ముట్టించి, ఓదమ్ము పీల్చాను.

బాలరాజు ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"ఏమిట్రా...అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?...రేపు మగపెళ్ళి వారితో ఎలా దెబ్బలాడలనా ? ..."

"అదికాదు మామయ్యా..."

"మరేమిట్రా ?..."

బాలరాజు నావైపొకసారి చూసి తల తిప్పేశాడు. 'చెప్పాలా ? వద్దా ?' అనో, 'ఎలా చెప్పాలా?' అనో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు మామయ్యా..." అన్నాడు చివరికి.

"విషయమేమిటో చెప్పరా...దానికింత ఆలోచనెందుకు ?..."

ఒక్క క్షణం నావైపు చూసి.

"నేను ప్రేమించాను మామయ్యా ..." అనేసి తప్పు చేసినవాడిలా ముఖం దించుకున్నాడు బాలరాజు.

నా అనుమానం నిజమైంది. వాడి వైపు చూశాను. నేల చూపులు చూస్తున్నాడు. బాలరాజు ప్రేమించాడన్న విషయం అసహజంగా అన్పించింది. అసలు ఇరవయ్యేళ్ళ బాలరాజు ప్రేమలో పడ్డాడంటే నమ్మలేక పోయాను. వాడి ముఖంలో పసితనమింకా పోలేదు. వాడి గొంతు ఇంకా చిన్నపిల్లాడి గొంతులాగే ఉంది. మీసాలు ఇంకా సరిగా రాలేదు; గెడ్డం ఇప్పుడిప్పుడే వస్తోంది కాని, ఇంకా కత్తిరతోనే కత్తిరిస్తున్నాడు !

పద్మక్క సంతానమల్లా ఇద్దరుకొడుకులు. పెద్దవాడు బాలరాజు. 'బి. ఎస్సి' పరీక్షలు రాశాడు. వాడిమీద అక్కా, బావగారూ చాలా ఆశలు పెట్టుకున్నారు! అలాంటిదివాడి ధ్యాస ప్రేమమీదకు మళ్ళిందేమిటి ?

ఇంతకీ ఎవర్రా ఆ పిల్ల ? ..."

"రాధ మామయ్యా ..."

"ఎప్పట్నుంచి ప్రేమిస్తున్నావ్ ? ..."

"నిన్నటివరకూ రాధ ఎవరో తెలీదు మామయ్యా ... వెంకట్రాజు మామయ్య పెద్ద కూతురు రాధ ... వాళ్ళు నిన్ననేగా వస్తే ... చూసిన తొలిక్షణంలోనే నా మనసును దోచుకుంది మామయ్యా ..."

వెంకట్రాజు పద్మక్కావాళ్ల పెత్తల్లి కొడుకు.

"నువ్వు ప్రేమించడం బాగానే ఉంది... నీది 'వన్‌సైడెడ్ లవ్' కాదుకద...? ఆ పిల్ల నువ్వంటే ఇష్టపడుతోందా ? ..."

"నువ్వు భలేవాడివి మామయ్యా ... నన్ను అంత అమాయకుడిగా జమకట్టేశావ్ ... నేనంటే రాధకి చాలా చాలా ఇష్టం మామయ్యా ... అది ఎలా తెలుసంటావేమో ... నాతో చాలా 'ఫ్రీ'గా మాట్లాడుతోంది ... మా అమ్మని మంచినీళ్లు అడిగాననుకో, 'నేతెస్తా బావా' అంటూ తెచ్చిస్తుంది ... అంతెందుకు...ఇందాక కాఫీ ఎవరు కలిపారనుకుంటున్నావ్ ? ... రాధ ..."

"నీకెలా తెలుసు ?... ఆ కాఫీ రాధ కలిపిందని ? ..."

"టేస్టు" మామయ్యా... 'టేస్టు' ...

మూలశంకకు

హెడన్సా

చికిత్స

శస్త్రచికిత్స

అవసరముండదు!

Bensons-2141-TEL


## బాలరాజు ప్రేమ కథ

మరోళ్ళు కలిపితే కాఫీకి ఆ 'టేస్టు' రాదు..."

వాడి ప్రేమ చాలా దూరం పోయింది. రెండ్రోజుల్లో ప్రేమ ఇంత దూరం వెళ్లడం ఆశ్చర్యమే మరి!

ఇరవయ్యేళ్ళ బాలరాజు ప్రేమలోపడ్డం, అదీ ఇంతగాఢంగా ప్రేమించెయ్యడం నాకెందుకో వింతగా తోచింది. నా మనసులో కొన్ని ప్రశ్నలు చెలరేగాయి.

ఒకటి : ఆ రాధ బాలరాజు చెప్పినంత అందంగా ఉంటుందా ? ..."

రెండు : ఇంత కుర్రతనంగా, అమాయకంగా ఉండే బాలరాజుని, ఆ పిల్ల ఓ కథానాయకుడిలా ఊహించుకుని ప్రేమించిందా ? ..."

మూడు : పద్మక్క దృష్టిలో బాలరాజు


తలనొప్పి లేక ఫ్లూబాధకు

అతిశీఘ్రంగా ఉపశమనం!






శాలోఫెన్

బాధానివారిణి మాత్రలు

శాలోఫెన్ తలనొప్పి, ఫ్లూ, పంటినొప్పి, ఒళ్లు నొప్పులకు అతి నిశ్చయంగా, శీఘ్రంగా ఉపశమనం కలిగిస్తుంది. ఇది నిరపాయకరమైనది. శాలోఫెన్ డాక్టర్లు సిఫారసుచేసే పటుతైన ప్రక్రియ కలిగియుంది.

FDS/AS/1920 TER


బోడ్నాడని నాసివేధన. ఇంకో అయిదారేళ్ల వరకూ వాడి పెళ్లిమాట తలపెట్టడు. అదీ కాక అక్కయ్యా బావగారూ వీడిచేత 'ఎమ్మెస్సీ' చదివించి, ఆ తర్వాత 'పి హెచ్. డి' అన్పించి అమెరికా కో, రష్యాకో పంపిద్దామనుకుంటున్నారు. అలాంటిది వీడు ప్రేమా—పెళ్లి అంటే వాళ్ళేమంటారు ?...

ప్రశ్నలకి జవాబులు దొరికాయి కాదు.

నేనూ, బాలరాజు ఇల్లు చేరుకుని డాబా మీద పక్కలు పర్చుకుని పడుకున్నాం. రెండు కొట్టేసరికల్లా పద్మక్క వచ్చి నిద్ర లేపింది. మేము మొహాలుకడుక్కునేసరికి, ఓ అమ్మాయి మా కిద్దరికీ కాఫీలు తెచ్చి ఇచ్చింది. ఆ అమ్మాయి వయసు పదహారేళ్ళకు మించదు. సన్నగా, పొడుగ్గా ఉంది. కళ్ళూ, ముక్కూ చూడ్డానికి ఇంపుగా ఉన్నాయి. ఆ అమ్మాయి నీలంరంగు జాకెట్టూ, పరికిణీ వేసుకుని, తెల్లటి వోణీ వేసుకుంది. చెవులకి రింగులు పెట్టుకుంది. శరీర వర్ణం చామన ఛాయ అయితేనేం, నవ్వు ముఖంతో కళ కళ్లాడుతోంది.

"వెంకట్రాజు మామయ్య కూతురు రాధ మామయ్యా..." బాలరాజు ఆ అమ్మాయిని నాకు పరిచయం చేసి, నవ్వు చూపిస్తూ.

"మా ప్రకాశం మామయ్య...'ఉరఫ్' జాబా వ్రాస్తారు వాళ్ళు...రేణుకమ్మగారి పాస్పెండు..." అన్నాడు.

ఆ అమ్మాయి ఫక్కున నవ్వి,

"నువ్వు పరిచయం చేసిన విధం బాగుంది బావా..." అన్నది.

ఆ తర్వాత ఏదో గుర్తు కొచ్చినట్లు నా వైపు తిరిగి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ,

'నమస్కారం ప్రకాశం బాబాయ్‌గారూ...' అన్నది.

. బాలరాజుకి నేను మామయ్యనైతే, రాధకి బాబాయిని! బాగుంది! బాలరాజునీ, రాధనీ తరచి తరచి చూశాను. రాధని చూడగానే వాడి ముఖం 'గ్యాసు లైటు'లా వెలగడం గమనించక పోలేదు!

రాధ తిరిగి వెళ్ళిపోతూంటే...

"రాధా..." అన్నాడు బాలరాజు.

"పిల్చావా బావా..." అంటూ నవ్వు ముఖంతో రాధ వచ్చింది.

"కాస్త వక్కపొడి తెచ్చి పెడతావా?..."

"అలాగే బావా..." రాధ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

రాధ పొడగరి. బాలరాజు కాస్త పొట్టి.

"రాధ ఎలా ఉంది మామయ్యా..."

## బాలరాజు ప్రేమ కథ

"బాగానే ఉంది...కాని..."

"ఏమిటి మామయ్యా ... కాని లూ, అర్థాలూ..."

"రాధ పొడగరి బాలూ...మరి నువ్వు..."

నేను మాటలు పూర్తి చెయ్యకుండానే బాలరాజు అడ్డు తగిలాడు.

"రాధ పొడగరే కాని నా కంటే మాత్రం పొడుగుకాదు మామయ్యా...నా చెవుల దగ్గరికి వస్తుంది..."

నేను నవ్వేశాను.


పెళ్లి ఘనంగా జరిగిపోయింది. ఉదయం కాఫీ ఫలహారాలూ, భోజనాలూ అయ్యాయి. ఆడవాళ్ళకి వడ్డనలు బాలరాజే చేశాడు.

రాధకి వడ్డంటున్నా మరి రెండు లడ్డులూ, కూరలూ వడ్డించాడు.

"ఆ పిల్లాడు ఆ వైపు వడ్డించ డేమిటి ?..." అన్నారు ఒకళ్ళిద్దరు వయసు మళ్ళిన ఆడవాళ్లు. కొందరాడవాళ్లు ముసి ముసి నవ్వులు నవ్వేరు. పాపం రాధ సిగ్గుపడి పోయింది.

వెంకట్రాజు స్వగ్రామం తణుకు. అతడికి ఆ చుట్టుప్రక్కల అరవై డెబ్బై ఎకరాల మాగాణి ఉంది. అతడి సంతానమల్లా ముగ్గురు కొడుకులు ఇద్దరు కూతుళ్ళు. అందరిలో పెద్దది రాధ. తణుకులో 'జూనియర్ ఇంటర్'లో చేరుతుందట !






"బరకగా ఉండే
పాత కాలపు
పళ్ల పొడులు
మీ చిగుళ్లకు పళ్లకు
చెరుపు చేస్తాయి..."

COLGATE
TOOTH POWDER

కాల్గేట్ టూత్ పౌడరుతో
మీ చిగుళ్లను, పళ్లను
కాపాడుకోండి. చెడు
శ్వాసను అరికట్టండి !

కాల్గేట్ టూత్ పౌడరుతో అధునాతన దంత సంరక్షణ పద్ధతి—దాని ఆహ్లాదకరమైన రుచిని మీరు ఎంతో మెచ్చుకుంటారు! మీ కుటుంబం కోసం ఈ రోజే ఒక డబ్బా కొనండి!







అమృతాంజన్ లిమిటెడ్‌వారి
గ్రైప్ మిక్స్చర్ జీర్ణశక్తిని
సరిచేస్తుంది.
బిడ్డని ఆరోగ్యంగా.
సంతోషంగా ఉంచుతుంది.
అమృతాంజన్ లిమిటెడ్‌వారి
గ్రైప్ మిక్స్చర్
వాయువు అజీర్ణం, పళ్లు వచ్చే
కాలంలో
గుణం
ఇస్తుంది.
అమృతాంజన్
లిమిటెడ్

AMRUTANJAN
Gripe Mixture


బిడ్డ సంతోషంగా ఉంటె
అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్
వాడినట్లే

OBM:2642 TG


ఉదయం మా భోజనాలయ్యాయి. బాలరాజు రాధతో కబుర్లలో పడ్డాడు. కొంతసేపు తను చదివిన కాలేజీ గురించి చెప్పాడు; తను చేరబోయే 'యూనివర్సిటీ' గురించి చెప్పాడు. ఇంకొంతసేపు 'సాలార్ జంగు మ్యూజియం' గురించి, 'చార్‌మినార్'గురించి, 'పబ్లిక్ గార్డెన్సు' గురించి చెప్పాడు. మరి కొంతసేపు ఊళ్లో సినిమాల గురించి, సినిమా హాళ్ళ గురించి చెప్పాడు. చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ, వాడివైపు చూస్తూ వింటున్న రాధను చూశాను.

ఆ రాత్రి భోజనాలయ్యాక పెళ్లివారు విజయవాడ వెళ్ళిపోయారు. వాళ్ళతో పార్వతి వెళ్ళిపోయింది. మా వైపు బంధువులు అప్పటికే చాలామంది వెళ్లిపోయారు. ఇల్లంతా చిన్నబోయినట్లయింది.

వెంకట్రాజూ, రాధా మరునాడు వెడతారట. ఆ రాత్రి భోజనాలయ్యాక డాబా మీదకు చేరి కబుర్లలో పడ్డాం. వెంకట్రాజు లోకాభిరామాయణంతో మొదలుపెట్టి, రాధ పెళ్లిలోకి వచ్చాడు. [ఇంకావుంది]




# బాలరాజు ప్రేమ కథ

చిత్రపు హనుమంతరావు

(గత సంచిక తరువాయి)

"మా రాధమ్మ పెళ్ళి చేసేద్దా మనుకుంటున్నానే పద్మా..." అన్నాడు పద్మక్కతో.

రాధలేచి, పిట్టగోడదగ్గరకు వెళ్ళి రోడ్డు వైపు చూస్తూ నిలబడింది. బాలరాజు మాత్రం ఆసక్తితో వింటూ కూర్చున్నాడు.

"దానికి అప్పుడే పెళ్ళేమిట్రా?... దానికింకా పదహారేకద..." అన్నది పద్మక్క.

"మా అమ్మ దానిపెళ్ళికోసం కలవరించేస్తోందే..."

పద్మక్క కొద్దిక్షణాలు ఆలోచించి, అన్నది.

"దానికేంరా పుత్తడి బొమ్మ...సుగుణాల రాశి...దాన్ని చేసుకునే వాడెవడోకాని అదృష్ట వంతుడు..."

"దానిపేర పదెకరాలు రాశాను...రొఖ్ఖం పదివేల వరకూ ఇద్దామనుకుంటున్నాను... పై సంబంధానికి పోడానికి జంకుగా ఉందే .."

"మన బంధువుల్లో ఎవరైనా అబ్బాయి పెళ్ళికున్నాడా?..."

"ఎవరివరకో ఎందుకమ్మా... మన బాలరాజుకి. చేసుకో కూడదూ... వాళ్ళిద్దరి ఈడూ జోడూ బావుంటుంది. ."

బాలరాజుకి పెళ్ళనగానే సిగ్గు ముంచుకొచ్చింది కాబోలు, చివాలున లేచి పిట్టగోడ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

"పెళ్ళనగానే అల్లుడికి సిగ్గు ముంచుకొచ్చింది ."అన్నాడు వెంకట్రాజు గట్టిగా నవ్వేస్తూ.

"భలే వాడివిరా వెంకటం...బాలుగాడికి పెళ్ళా...వాడి వయసెంత?... ఇంకా బొడ్డూడని పసివెధవ వాడు..."

"ఆదేమిటే. వాడికి ఇరవయ్యేళ్ళులేవూ? ఇంకా పసివాడేమిటి?... వాడి వయసుకి, నాకు మా రాధమ్మ పుట్టేసింది !..."

"అప్పటి రోజులు వేరురా వెంకటం... బాలుగాడికి చదువింకా పూర్తి కాలేదు... వాడిపొట్ట వాడే పోషించుకోలేడు ... వాడికి అప్పుడే పెళ్ళేమిట్రా?..."

"పెళ్ళి ఇప్పుడే చేసేద్దామనడంలేదు... ప్రస్తుతం మనం అవునమకుంటే పెళ్ళి వాడి చదువయ్యాకే చెయ్యొచ్చు ... నాలుగేళ్ళు ఎంతలో గడుస్తాయి చెప్పు ...మారాధమ్మని కూడా 'బి. ఏ' చదివిస్తాను..."

పద్మక్క దీర్ఘంగా నిట్టూర్చింది.

"నాలుగేళ్ళ తర్వాత మాట ఏం చెప్ప గలంరా.. నాలుగేళ్ళ తర్వాత వాడిమనసు ఎలా ఉంటుందో...నువ్వు వాడికోసం దానికిపెళ్ళి చెయ్యకుండా ఉంచావనుకో... నాలుగేళ్ళ తర్వాత వాడు చేసుకోనంటే? అప్పుడు మన బంధుత్వాలు చెడవూ?..."

వెంకట్రాజు కొద్దిసేపు మాట్లాడలేదు. చివరకు నిట్టూర్చి అన్నాడు :

"సరే నీ ఇష్టం పద్మా ... మన బంధుత్వాలు మరింత దగ్గరవుతాయనుకున్నాము.."

బాలరాజు విసవిసా నడుస్తూ క్రిందకు దిగిపోయాడు. నేను కూడా కాస్సేపు తిరిగి వద్దామని బయలుదేరాను. వాడూ నాకూతా వచ్చాడు. మా మూలుగానే కాలేజీ ఎదురుగాఉన్న తూముమీద చతికిలబడ్డాం. నేను సిగరెట్టు ముట్టించుకున్నాను.

" మా అమ్మకి మతిలేదు మామయ్యా "

"తప్పురా బాలూ ... పెద్దవాళ్ళని అలా అంటే కళ్ళు పోతాయట ... "

"కాకపోతే మరేమిటి మామయ్యా ... నేను పసివెధవనా ... బొడ్డూడని పసివెధవనా ? ... నువ్వేచెప్పు ... " బాలరాజు ఉక్రోషంతో అన్నాడు.

"అది సహజంరా బాలూ ... నాకు ముప్ఫయ్యేళ్ళు వస్తున్నాయా, ఓ బిడ్డకి తండ్రినా, మా అమ్మ నన్ను 'పసివెధవ'నే అంటుంది ... తల్లికి బిడ్డల వయసు తెలియదురా ... ఆ కళ్ళకి తన పిల్లలు పసి వాళ్ళగానే కన్పిస్తారు ... "

"ఆ సంగతి అలావుంచు మామయ్యా... వెంకట్రాజు మామయ్య నా కోసం రాధకి పెళ్ళి చేయకుండా అట్టే పెడతానన్నాడుకద... అవునంటే ఏంపోతుంది చెప్పు ... వెంటనే కాదని చెప్పేయడమెందుకు ? ... "

"మీ అమ్మ చెప్పింది కూడా సబబుగానే ఉందిరా బాలూ ... ఆ రాధ ఇప్పుడు నీకు నచ్చింది ... నాలుగేళ్ల కాలం ఆడపిల్లకి తక్కువదేంకాదు ... ఇప్పుడు పూలరెమ్మలా ఉన్న రాధ నాలుగేళ్ల తర్వాత పిప్పళ్ళబస్తాలా తయారవచ్చు ... అప్పుడు నీ కళ్లకు రాధ నచ్చకనూపోవచ్చు, పెళ్లి చేసుకోననూ వచ్చు .. నీకోసం పెళ్లి చెయ్యకుండా రాధని ఉంచిన వెంకట్రాజు ఏమవాలి ? ...

నాలుగేళ్లపాటు నిన్ను కాబోయే భర్తగా ఊహించుకొని, కలలు కన్న రాధ ఏమవ్వాలి ? ... "

"ఎవరూ ఏమీ కానక్కర్లేదు ... నాలుగేళ్లుకాదు; పదేళ్ల తర్వాతైనా సరే రాధ ఎలాఉన్నా చేసుకుంటానని హామీ ఇస్తున్నాను ... "

నేనేం మాట్లాడలేదు. జీవితమంటే ఏమిటో తెలియని వాడి మాటలు ఎలా నమ్మగలను ? జీవితాన్ని అతి తేలిగ్గా తీసుకునేవాడు, అన్నమాట నిలబెట్టు కుంటాడనే మిటి ? వాడిలో పసితనమింకా పోలేదు. నాలుగేళ్లతర్వాత రాధని చేసుకోడానికి ఇష్టపడక, 'తెలిసీ తెలియని వయసులో ఏదోఅన్నా న'ని అంటే ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు ?

'రాధంటే నాకు చాలా ఇష్టం మామయ్యా...మనసా, వాచా గాఢంగా ప్రేమించాను...రాధకి అందమే కాదు, ఆత్మ సౌందర్యం కూడా ఉంది...మా మనసులు కలిశాయి, మా అభిరుచులు కలిశాయి... అలాంటిది రాధకి ద్రోహం చెయ్యగలనా ? నా చదువు పూర్తి కాగానే రాధ ఎలా ఉన్నా చేసుకుంటాను మామయ్యా..."

నేనేం మాట్లాడక పోవడంతో, నా వైపు చూసి వేడికోలు స్వరంతో అన్నాడు.

"నీ మాటకి అమ్మ చాలా విలువ నిస్తుంది మామయ్యా...ఎలాగైనా అమ్మచేత "సరే" నన్పించు మామయ్యా ..నేనూ, రాధా నీకు జీవితాంతమూ రుణపడి ఉంటాం మామయ్యా..."

"మరి మీ నాన్న..."

"నాన్నగారు నాకు ఎదురు చెప్పరు..."

"సరే ప్రయత్నిస్తాను..."

పద్మక్క సరేనంటుందన్న ఆశ నాకు లేదు !

ఆ మరునాడు ఉదయం, గదిలో పద్మక్క ఒక్కర్తే ఉన్న సమయం చూసి వెళ్ళాను. తను బట్టలు సర్దుతోంది, నన్ను చూసి,

"ఏం కావాల్రా ప్రకాశం ?...." అన్నది.

"అబ్బే ఏం లేదక్కా .... తోచక వచ్చాను...."

"అలా మంచంమీద కూర్చో...."

కొంతసేపు పెళ్ళి విశేషాలు మాట్లాడుకున్నాం. చివరకు అసలు విషయానికి వచ్చాను.

"ఆ రాధ పూలరెమ్మలా ఉంటుంది పద్మక్కా....ఆ పిల్లకి మల్లెపూలకి అందంతో పాటు పరిమళం ఉన్నట్లు సకల సుగుణాలూ ఉన్నాయి సుమీ.... పెళ్లిలో చలాకీగా ఎంత పని చేసిందనుకున్నావ్ ?...."

పద్మక్క తలూపింది.

"అవున్రా....అది పెళ్లిలో చాలా పని చేసింది....దానికి అందమే కాకుండా ఎన్నికైన సుగుణాలున్నాయి...."

"ఆ పిల్లని చేసుకునే వాడెవడో కాని అదృష్టవంతుడు...."

"బాగా చెప్పావ్....దానికోసం ఏవడో మల్లెపూలతో పూజ చేస్తున్నాడు .... ఎవరో ఆ అదృష్టవంతుడు ... "

"ఆ అదృష్టవంతుడు మన బాలరాజే ఎందుక్కాకూడదు పద్మక్కా.." అక్కయ్య తెల్లబోయింది. చేస్తున్నపని ఆపేసి, నిలబడింది.

"వెంకట్రాజుకే అనుకున్నాను ... నీక్కూడా మతిపోయిందేమిట్రా ప్రకాశం... బాలుగాడివయసెంతరా ... వాడింకా కుర్ర వెధవేకద...ఇంకా వాడుచదివింది బి.ఎస్సీ... వాణ్ని 'ఎమ్మెస్సీ' చదివించి, 'పి. హెచ్. డి'కి పంపాలని, ఆ తర్వాత 'ఫారిన్' పంపాలనీ మీ బావగారు ఎంత ఆశతో ఉన్నారో నీకు తెలియదా... చెప్పు ... అలాంటిది వాడికి పెళ్ళేమిట్రా ?.."




"అవుననుకో పద్మక్కా... వెంకట్రాజు రాధకి పెళ్ళిచెయ్యకుండా నాలుగేళ్ళపాటు ఉంచుతానన్నాడు కద..."

అక్కయ్య కొంతసేపు మాట్లాడలేదు. ఆ తర్వాత అన్నది:

"నాలుగేళ్ళకాలం తక్కువదేం కాదురా ప్రకాశం... నువ్వన్నట్లు రాధమ్మ ఇప్పుడు పూలరెమ్మలాగే ఉంది...అయితేదానిది ఎదిగే వయసు...నాలుగేళ్ళ తర్వాత అది ఎలా తయారవుతుందో ఎవరికెరుక? ఇప్పుడే అది అయిదడుగుల రెండంగుళాల పొడుగుంది... ఇంకో నాలుగైదు అంగుళాల పొడుగు ఎదగచ్చు...కొంచెం లావెక్కనూవచ్చు... అది అలా ఉంచు...మనవాడికి అది ఇప్పుడు నచ్చచ్చు... నాలుగేళ్ళ తర్వాత 'దాన్ని నేను చేసుకోనంటా'డనుకో, అప్పుడు దాని గతేం కావాలి? ఓ ఆడపిల్లకి లేనిపోని ఆశలు కల్పించకూడదురా... అదీకాక వెంకట్రాజు ఏమనుకుంటాడు ...అంత్య నిష్ఠూరంకంటే ఆదినిష్ఠూరమే మేలురా.."

పద్మక్కతో మరి వాదించదల్చుకోలేదు. తనను ఒప్పించగలనన్న నమ్మకం నాకు లేదు. మారు మాట్లాడక బయటకు వచ్చేశాను.

పందిట్లో వాలుకుర్చీలో కళ్ళుమూసుకుని, నుదుట చెయ్యి పెట్టుకుని కూర్చుని ఉన్నాడు బాలరాజు. దగ్గరకు వెళ్ళి పిలిచాను.

"బాలూ..."

"ఏం మామయ్యా..."

బాలరాజు కళ్ళు విప్పి చూశాడు. నేను జరిగింది చెబుదామనుకున్నంతలో "నువ్వేమీ చెప్పనవసరంలేదు మామయ్యా ... అంతా విన్నాను.."అన్నాడు.

ఆ సాయంత్రం వెంకట్రాజూ, రాధా ప్రయాణమయ్యారు. పేరు పేరునా అందరికీ చెప్పి, బాలరాజు కోసం నలుదిక్కులా చూసి తలవంచుకుని, 'టాక్సీ' ఎక్కింది రాధ.

బాలరాజు ఎక్కడున్నాడో నాకు తెలుసు. డాబామీద పిట్టగోడ దగ్గర నిలబడి రోడ్డు వైపు చూస్తున్నాడు. వాడి ముఖం కళావిహీనంగా ఉంది. 'టాక్సీ' కదిలాక కళ్ళు తుడుచుకోవడం గమనించక పోలేదు.

ఆ రాత్రి బాలరాజు సరిగా భోజనం చెయ్యలేదు ఎవరితోనూ సరిగా మాట్లాడనూ లేదు. వాడి మనసు రాధ నుంచి తప్పించాలని

శికారు బయల్దేరతీశాను. 'యూనివర్సిటీ' రోడ్డుమీద కొంతదూరం నడిచి, ఓ తూము మీద కూర్చున్నాం. నేను సిగరెట్టు ముట్టించుకుని, అన్నాను.

"ఓ సంగతిరా బాలూ...నువ్వు చిన్నప్పుచ్చుకుంటావని చెప్పలేదుకాని, రాధ నువ్వనుకున్నంత అందకత్తె కాదురా ... కాస్త పొడుగు తప్పించి, ఆ పిల్లలో ఏముంది ? కళ్లు కాస్త పెద్దవేననుకో, ముక్కూ బాగానే ఉందనుకో...మరిజడ ? ఆడదానికి ఒత్తయిన పొడవైన, జుత్తే అందంరా ... రాధ జడ భుజాలుదాటలేదు ... అదీకాక రంగు ? .. ఛామనఛాయ ... అంద చందాలమాట అలా

# బాలరాజు ప్రేమ కథ

ఉంచు ... నువ్వుపుట్టింది బొంబాయిలో ... మీ నాన్న ఉద్యోగరీత్యా బొంబాయిలో, ఢిల్లీలో, మద్రాసులో, హైదరాబాదులలో పెరిగావు ... నీ అలవాట్లన్నీ పట్నవాసపు అలవాట్లు ... నీ భావాలన్నీ ఆధునికభావాలు ... మరి రాధ ? తణుకులో పుట్టి పెరిగింది. ఆ కట్టూ, బొట్టూ, ఆ మాటలూ, ఆ అలవాట్లూ పల్లెటూరి పిల్లని చెప్పక చెబుతున్నాయి. ఆ పిల్ల భావాలప్పి పూర్వోత్తరాలనివే ... మీరిద్దరూ భిన్నధ్రువాలు ."

బాలరాజు నామీద కోపం తెచ్చుకున్నాడు.

"నీ మాటలకేం మామయ్యా .: రాధ బావుందని నువ్వే అన్నావు . ఇప్పుడు మాట మార్చేస్తున్నావు ... నాలుగేళ్ల తర్వాత రాద ఎలాఉన్నా చేసుకుంటానన్నాను కద .అయినా మా అమ్మకి బుద్ధిలేదు మామయ్యా ... నేను ప్రేమించిన అమ్మాయిని నాకు కాకుండా చేసింది...ఇద్దరు ప్రేమికుల్ని విడదీసింది.·."

నేనేం మాట్లాడలేదు. బాలరాజు దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు.

"కళ్లు మూసినా, తెరచినా రాధే కన్పిస్తోంది మామయ్యా. . నాహృదయాన్ని అర్పించాను... తను మాత్రం ? ఉన్న రెండ్రోజులూ నేనెక్కడ ఉంటే తనూ అక్కడే ఉండేది. నాకేం కావాల్సొచ్చినా తెచ్చి ఇచ్చేది. నన్ను గాఢంగా ప్రేమించింది మామయ్యా. . 'టాక్సీ' ఎక్కుతున్నప్పుడు రాధ ఎలాఉందో నువ్వే చూశావు కద మావయ్యా. కానీ మా అమ్మ మేమిద్దరం ఎప్పటికీ కలవకుండా చేసేసింది రాధని జీవితాంతమూ మర్చిపోలేను. ఆ లోటు ఎప్పటికీ పూడదు. మిగిలిన జీవితాన్ని జీవచ్ఛవంలా బ్రతకాలి నా జీవితం ముగింపు ఎంతో దూరంలో లేదు; నాకు విషాదమే మిగిలింది మావయ్యా..."

నేనేం మాట్లాడలేదు.

బాలరాజు వయసు అలాంటిది. ఆరాధ కాస్త బాగుంది. వాడితో చనువుగా మాట్లాడింది. ఆ పిల్ల వాడిని ఇంత గాఢంగా ప్రేమించిందో లేదో నాకు తెలియదు. అసలు రాధ అపురూప సౌందర్యవతేం కాదు కొద్ది రోజుల్లో బాలరాజు రాధని మర్చిపోవచ్చు ఆ వయసులో కుర్రకారు మనసు ఓ అమ్మాయిపైన స్థిరంగా నిలవదు ! రేపొద్దున్న రాధకన్న అందమైన అమ్మాయి వాడికి తారస పడితే వాడిమనసు రాధనుండి ఆ అమ్మాయి మీదకు మళ్ళుతుంది ఆతర్వాత అంతకన్నా అందమైన అమ్మాయి తారస పడితే ఆ అమ్మాయి మీద నిలవదు ! చదువు పూర్తయి, ఓ ఉద్యోగంలో స్థిరపడేంత వరకూ, వాడిమనసుకో స్థిరత్వం రాదు వయసు పెరిగిన కొద్దీ మనిషికి జీవితంతో రాజీ పడ్డం దానంతటదే అలవడుతుంది.

బాలరాజు అన్నట్లు వాడికి జీవితంలో విషాదమే మిగల్లేదు; వాడికి ఉజ్వలమైన భవిష్యత్తుంది. వాడన్నట్లు వాడి జీవితం ముగింపుకు రాలేదు; వాడి జీవితం ఇక్కడితోనే మొదలవుతుంది !


దేవి పిల్స్ REGD

వాడండి ముఖ్యంగా అలస్యమైన, శ్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు

స్త్రీలకు ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించదు

SEALED PACKING: 28 & 14 TABLETS

AVAILABLE AT ALL CHEMISTS

MFRS: SEENU & CO., MADRAS-81



22ct బంగారు కవరింగ్ చేసినవి

స్థాపితం:1936

శ్రీ జ్యోతి



శ్రీ జ్యోతి గోల్డు కవరింగ్ వర్క్సు

H.O. చిలకలపూడి. A.P.






లిచెన్‌సా వాడండి

DZ 1613 ATG



ఆయుర్వేద పద్ధతిలో తయారుచేయబడిన

నెర్వోఫిక్స్

NERVOFIX

40 రు 10 పోస్టేజిఅదనం

శ్రీ సుబ్రహ్మణ్య ఆయుర్వేద కెమికల్ ఇండస్ట్రీస్, విజయవాడ.

సోల్ డిస్ట్రిబ్యూటర్స్

మాతృశ్రీ ఏజన్సీస్, విజయవాడ–2.



35సం॥ అనుభవం

వరిబీజము బుడ్డలు బీజకులు మొదలగు వ్యాధులకు ఆపరేషన్ లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును

వివరములకు:

రావ్ అండ్ కో ఆసుపత్రి

గౌలిగూడ నయబస్ డిపో ఎదురు, రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర

ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38344